
మనం
కరీంనగర్
జగిత్యాల- రాజన్న సిరిసిల్ల- పెద్దపల్లి -మంచిర్యాల- కొమురంభీమ్
శుక్రవారం | 10 | ఫిబ్రవరి | 2023 | పేజీలు : 8



## ఉచిత శిక్షణను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి

ప్రణాళిక ప్రకారం పరీక్షలకు సన్నద్ధం కావాలి

ఈనెల 9నుండి మే 8వరకు గ్రూప్స్ కొరకు ఉచిత శిక్షణా

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రారంభించిన అదనపు కలెక్టర్

7 లో



# కలిసికట్టుగా రాజన్న జాతరను విజయవంతం చేయాలి

## రాజన్న సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి




రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 9, (మనం న్యూస్): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేములవాడలో జరుగనున్న మహాశివరాత్రి జాతరను అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరిస్తూ ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో సమిష్టిగా విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సాధారణ భక్తులే కేంద్రంగా భక్తులు మెచ్చేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. వేములవాడలో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు మహా శివరాత్రి జాతర జరగనున్న నేపథ్యంలో జాతర ఏర్పాట్ల పై గురువారం వేములవాడ ఆలయంలోని ఓపెన్ స్లాబ్‌లో వివిధశాఖల జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్‌తో పాటు ఎస్పీ అఖిల్ మహాజన్, జిల్లా అదనపు కలెక్టర్ లు బి సత్య ప్రసాద్, ఎన్ ఖీమ్యా నాయక్, ఆలయ కార్యనిర్వహణాధికారి కృష్ణ ప్రసాద్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతర సందర్భంగా ట్రాన్స్‌పోర్ట్, పార్కింగ్, రోడ్ల మరమ్మతులు, అకామిడేషన్, తాగునీరు, విద్యుత్ సరఫరా, బందోబస్తు, పారిశుద్ధ్యం, క్రౌడ్, క్యూలైన్ మేనేజ్మెంట్, పబ్లిక్ అడ్రెస్ సిస్టం ఏర్పాటు, శివార్చన కార్యక్రమం, సూచికల ఏర్పాటు, ప్రచారం, అనుబంధ ఆలయాల్లో ఏర్పాట్లు తదితర అంశాలపై పురోగతిని ఆయా శాఖల అధికారులు కలెక్టర్ కు వివరించారు. అనంతరం అనురాగ్ జయంతి మాట్లాడుతూ దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడలో జరిగే మహా శివరాత్రి పర్వదిన వేడుకల్లో ఎక్కడా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్ల కోసం ఉద్దేశించిన ఆక్షన్ ప్లాన్ అమలవుతుందని చెప్పారు. కార్యచరణ ప్రణాళిక, క్షేత్రస్థాయిలో అమలు ఏమైనా గ్యాప్ లు ఉంటే సరి చేసుకోవాలని అధికారులకు సూచించారు. మహా శివరాత్రి జాతరలో కంట్రోల్ రూమ్ కీలకంగా ఉండనున్న దృష్ట్యా పకడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు. సంబంధిత ప్రభుత్వ శాఖలు తమ శాఖకు సంబంధించిన బాధ్యుల వివరాలను వెంటనే ఆలయ అధికారులకు అందజేయాలన్నారు. జాతరకు పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు సహకారం అందించేందుకు, గైడెన్స్ ఇచ్చేందుకు వీలుగా' మే ఐ హెల్ప్ యు' సెంటర్లను సరిపడా ఏర్పాటు చేయాలని సూచించారు. సంక్షేమ శాఖల విభాగాల అధికారులు ఈ కేంద్రాల కోసం సరిపడా మ్యాన్ పవర్ సమకూర్చుకోవాలి అన్నారు. ఈ సెంటర్ లకు జిల్లా సంక్షేమ అధికారి పర్యవేక్షణ బాధ్యతలను చూడాలన్నారు. మహాశివరాత్రి జరిగే వేములవాడ పట్టణంలో సానిటేషన్ ను పకడ్బందీగా చేపట్టేందుకు పట్టణమును జోన్లుగా విభజించుకోవాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. జాతర జరిగే 3 రోజులు మూడు షిఫ్ట్ లలో ,24 గంటలు పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరం జరిగేలా చూడాలన్నారు. ప్రతి జోనుకు పారిశుద్ధ్య సిబ్బంది, ట్రాక్టర్ తో పాటు పర్యవేక్షణ అధికారి తప్పనిసరిగా ఉండాలన్నారు. వేములవాడ పట్టణానికి వచ్చే ముఖ్య ప్రధాన రహదారుల వెంబడి అవసరమైన చోట టెంపుల్ అథారిటీలను సంప్రదించి ఆర్ అండ్ బి అధికారులు సైనేజులను ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో జాతరకు వచ్చే భక్తులను గైడ్ చేసేలా ముఖ్య కూడళ్ళు, ప్రదేశాలలో శాశ్వత ప్రాతిపదికన రేడియం స్టిక్కర్స్ తో కూడిన సైనేజీలను మున్సిపల్ కమిషనర్ ఏర్పాటు చేయాలని సూచించారు. మహా శివరాత్రి జాతర సందర్భంగా చేపట్టిన పెండింగ్‌లో ఉన్న పనులను ఈనెల 15వ తేదీ లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జాతర సందర్భంగా భక్తులకు నిరంతర వైద్య సేవలు అందించేందుకు వీలుగా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మూడు షిఫ్టులలో సిబ్బంది పని చేసేందుకు వీలుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. కంటి వెలుగు శిబిరాలలో డ్యూటీలో ఉన్న సిబ్బందిని డిస్టర్బ్ చేయకుండా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు .ఆలయం కు కోసం వచ్చే భక్తులకు వైద్య సేవలు అందించేందుకు వీలుగా సిద్ధం చేస్తున్న బస్తీ దవాఖానను శివరాత్రికి ముందే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ ,ఆలయ అధికారులకు సూచించారు. మహాశివరాత్రి జాతర సందర్భంగా చేపట్టిన అన్ని రోడ్డు ప్యాచ్ వర్క్ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని

మిగతా 2లో..

## ఘనంగా సంకష్టహర చతుర్థి పూజలు

4 లో



## ఆరోగ్యానికి మేలు చేసే చిరుధాన్యం పంటలు పండించాలి

### కరీంనగర్ కలెక్టర్ కర్ణన్




కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 9 (మనం న్యూస్): ఆరోగ్యానికి మేలు చేసే చిరుధాన్యాలను రైతులు పండించాలని జిల్లా కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ పేర్కొన్నారు. గురువారం అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవాన్ని పురస్కరించుకొని వ్యవసాయ పరిశోధన స్థానంలో ఏర్పాటు చేసిన సాంకేతిక, యంత్ర ప్రదర్శన మేళాలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజు చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే ఎటువంటి వ్యాధులు దరిచేరవన్నారు. అందరూ ఆరోగ్యంగా ఉండడం మాత్రమే కాకుండా, భవిష్యత్తును కూడా ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేలా చిరుదాన్యాల పంటను పండించడంతో పాటు ఒకపూట ఆహారంగా తీసుకోవడాన్ని ప్రారంభించాలని సూచించారు. ఒకప్పుడు పండుగలకు మాత్రమే వరి అన్నాన్ని వండుకుని, మిగిలిన రోజులు చిరుధాన్యాలతో కడుపునింపుకున్నవారు ఇప్పుడు ఎంతో ఆరోగ్యంగా, వృద్దాప్యంలో ఒకరిమీద ఆదారపడకుండా జీవిస్తున్నారన్నారు. అంతటి ఆరోగ్యవంతమైన చిరు ధాన్యాలను మనకోసం మనం మాత్రమే కాకుండా, మన కుటుంబం, రేపటి భవితకు సంపూర్ణ అరోగ్యాన్ని అందించేలా సాగు చేసుకోవాలని, జిల్లాయంత్రాంగం తరపున సాగుకు పూర్తి సహాకారాన్ని అందిస్తామని తెలిపారు. చిరుదాన్యాల సాగు ప్రోత్సహించే దిశగా అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని అధికారులకు సూచించారు. దళితుల అభ్యున్నతి కొరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబందు పథకం ద్వారా ఒక్క హుజూరాబాద్ నియోజకవర్గంలోనే వ్యవసాయం, దాని అనుబంధ రంగాల యూనిట్ల స్థాపన 300 కోట్ల రూపాయలు అందించినట్లు తెలిపారు. ఇందులో 500 హర్వెస్టర్లు, 2వేల ట్రాక్టర్లు, 20 డ్రోన్లు, 120 ఫర్టిలైజర్ షాపులను ప్రారంభించినట్లు కలెక్టర్ వివరించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వెయ్యి నుండి 1500 మందికి దళితబంధు పథకం ద్వారా వ్యవసాయ రంగానికి అధిక ప్రాదాన్యత ఇచ్చేలా 80 శాతం వ్యవసాయ, అనుబంధ రంగాలకు మాత్రమే కేటాయించి ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. రైతులకు అండగా జిల్లా యంత్రాంగం

మిగతా 2లో..

# విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలి

## ఎస్సై ఆరోగ్యం



సైదాపూర్, ఫిబ్రవరి 9 (మనం న్యూస్): విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో కూడా రాణించాలని సైదాపూర్ ఎస్సై జున్ను ఆరోగ్యం తెలిపారు. గురువారం కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని ఆకునూరు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు ఆయన బహుమతులను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల వల్ల మానసికోల్లాసంతో పాటు దేహదారుఢ్యం పెంపొందుతుందన్నారు. క్రీడల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించడంతో పాటు చదువులోనూ రాణిస్తే, ప్రభుత్వ ఉద్యోగాలను సులువుగా పొందవచ్చున్నారు. తాను విద్యార్థి దశ నుంచి వాలీబాల్ క్రీడాకారున్నని, అంతర్జాతీయ స్థాయి పోటీల్లోనూ తాను పాల్గొన్నట్లు ఎస్సై తెలిపారు. స్పోర్ట్స్ కోటాలోనే తనకు ఎస్సైగా ఉద్యోగం లభించిందని పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులు ఎస్సైని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, సుధాకర్, హనుమండ్ల భాస్కర్, గోదావరి, రవీందర్ రెడ్డి, సమ్మయ్య, రాజు, రాజకుమార్, విజయ్ కుమార్, మాలతి, స్వర్ణలత, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ జయంతి రోజు సచివాలయాన్ని ప్రారంభించాలి

హుజూరాబాద్‌టౌన్,ఫిబ్రవరి 9,(మనం న్యూస్) : అంబేద్కర్ జయంతి రోజు సచివాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అదికార ప్రతినిధి సొల్లు బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా ప్రారంభించడం ఏమిటాని ప్రశ్నించారు. అన్ని మతాలకు, అన్ని కులాలు, పార్టీలు గౌరవించే పండుగ అంబేద్కర్ జయంతి అని పేర్కొన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం మూలంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో సచివాలయాన్ని అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రారంభించాలని కోరారు.

# బీఆర్ఎస్ యూత్ నాయకుల పూజలు



హుజూరాబాద్‌టౌన్,ఫిబ్రవరి 9,(మనం న్యూస్) : బీఆర్ఎస్ యూత్ నాయకులు వొడితెల ప్రణవ్-మృణాళిని దంపతుల వివాహా వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని హనుమాన్ దేవాలయంలో బీఆర్ఎస్ యూత్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పంజాల మురళీ, రాకేష్‌కుమార్, మధుకర్‌రెడ్డి, సాయిక్రిష్ణ, జోంగొని రాజు, బండ నవీన్, వెంకటేష్, దేవరాజు, అన్వేష్ తదితరులు ఉన్నారు.

# కలిసికట్టుగా రాజన్న జాతరను విజయవంతం చేయాలి

మొదటి పేజీ తరువాయి..

జిల్లా కలెక్టర్ రోడ్లు భవనాల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వేములవాడ పట్టణం నుంచి బోయినపల్లి వెళ్లే మార్గంలో ప్యాచ్ వర్క్ ఏమైనా పెండింగ్ ఉంటే వెంటనే ఆ పనులను పూర్తి చేయాలన్నారు. నాంపల్లి గుట్ట పైన గల స్టెప్ వెల్స్ క్వాలిటీని మెరుగుపరిచి వాడుకలోకి తేవాలని జిల్లా కలెక్టర్ పంచాయతీ రాజు ఇంజనీరింగ్ అధికారులు ఆదేశించారు. పార్కింగ్ ప్రదేశాలు, బస్టాండ్ వద్ద భక్తుల సౌకర్యార్థం మంచి త్రాగునీరును అందుబాటులో ఉంచాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను జాతర సందర్భంగా తిరిగి వినియోగంలోకి తేవాలని ఆలయ అధికారులకు సూచించారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ శివరాత్రి జాతరకు జిల్లా నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి కూడా అదనంగా పోలీస్ సిబ్బందిని రప్పించి పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భక్తులకు ట్రాఫిక్, పార్కింగ్ ఇబ్బందులు తలెత్తకుండ ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. ట్రాఫిక్ , పార్కింగ్, క్యూ లైన్, ధర్మగుండం కంట్రోల్ రూమ్, బ్యారికెడింగ్ మేనేజ్మెంట్ ను పకడ్బందీ గా చేస్తామని చెప్పారు.గతం కంటే అధికంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిఘా నేత్రలతో జాతరను పర్యవేక్షణ చేస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పర్యవేక్షణ చేస్తామని తెలిపారు. అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ వేములవాడకు వచ్చే భక్తుల సౌకర్యార్థం జాతర సమస్త సమాచారం లభించేలా భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఆప్ ను సిద్ధం చేసినట్లు తెలిపారు. స్మార్ట్ ఫోన్ లలో డౌన్ లోడ్ చేసుకునేందుకు వీలుగా త్వరలోనే ఆప్ ను గూగుల్ ప్లే స్టోర్ లో అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాస్ రావు, వేములవాడ డీఎస్పీ నాగేంద్ర చారి, జిల్లా రవాణా అధికారి కొండల్ రావు, సెస్ ఎండి రామకృష్ణ, డీపీవో రవీందర్, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ లు బి సత్య ప్రసాద్, ఎన్ ఖీమ్యా నాయక్ లు శ్రీ రాజ రాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు వారికి స్వామి వారి ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.

# ఆరోగ్యానికి మేలు చేసే చిరుధాన్యం పంటలు పండించాలి



మొదటి పేజీ తరువాయి..

ఉంటుందని, ధరణి సమస్యలను కూడా సత్వరమే పరిష్కరించడం జరుగుతుందన్నారు. జిల్లా పరిషత్ సిఈఓ ప్రియాంక మాట్లాడుతూ చిరుదాన్యాలను ప్రతిరోజు ఆహారంగా తీసుకోవడం మూలనా 60 సంత్సరాల వయస్సులో కూడా 30 సంవత్సరాల వారికి సమానంగా పనులు చేయగలుగుతారని తెలిపారు. ఇప్పటి జనరేషన్ మిల్లెట్ ఫుడ్ కు దూరమై, జంగ్ ఫుడ్ కు అలవాటు పడి చిరుప్రాయంలోనే అనారోగ్యాలకు దగ్గరవుతున్నారని, వారందరికి చిరుదాన్యాల వలన కలిగే మేలును తెలియజేస్తూ రోజులో ఒక పూట చిరుదాన్యాల ఆహారాన్ని తీసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో చివరగా జడ్పి సిఈఓ ఐఎఎస్‌గా కన్ఫామ్ అయిన సందర్భంగా కళాశాల బృందం ఆమెను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్తర తెలంగాణ మండల సహాయ సంచాలకులు జి. శ్రీనివాస్, కళాశాల ప్రధానోపాధ్యాయురాలు మంజులత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్, వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు డాక్టర్ పి. రాజయ్య, అనంత్ కుమార్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వర్లు, నాబార్డ్ ఏజీఎం, వ్యవసాయ పరిశోదన అధికారులు, తహాసీల్దార్ లక్ష్మి నరసింహ రావు, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులు, రైతులు పాల్గొన్నారు.

# డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో మాతృశ్రీ విద్యార్థుల ప్రతిభ



హుజూరాబాద్‌టౌన్, ఫిబ్రవరి 9, (మనం న్యూస్) : శాతవాహన యూనివర్సిటీ ప్రకటిచిన డిగ్రీ మూడో, ఐదో సెమిస్టర్ ఫలితాల్లో మాతృశ్రీ డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబర్చినట్లు కరస్పాండెంట్ కాయిత ఇంద్రసేనారెడ్డి, ప్రిన్సిపాల్ వల్లూరి రామారావులు తెలిపారు. డిగ్రీ 3వ సెమిస్టర్‌లో బీజెడ్‌సిలో జెల్ల రోహిణి-9.42, బండారి ఆస్మిత-9.21, ఎంపీసీఎస్‌లో శివాని-9.03, బీకాం సీఏలో వెంగళ అనూష-8.85, బీఏలో గూళ్ల ప్రశాంత్-7.84, ఐదో సెమిస్టర్‌లో ఎంపీసీఎస్‌లో అఖిల-9.01, బీకాం సీఏలో బైరవేణి అంజలి-8.67, బీజెడ్‌సిలో గూళ్ల భవానీ-8.21 జీపీఏ సాధించినట్లు తెలిపారు. అత్యుత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

# నేరాల ఛేదనే లక్ష్యంగా ముందుకు సాగాలి

## కరీంనగర్ సిపి సుబ్బారాయుడు



కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 9 (మనం న్యూస్): నేరాల ఛేదనే లక్ష్యంగా క్రైం విభాగాలకు చెందిన పోలీసులు ముందుకుసాగాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బారాయుడు పిలుపునిచ్చారు. కమిషనరేట్ కేంద్రంలో గురువారం క్రైం విభాగాలకు చెందిన పోలీసులతో సిపి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల ఛేదనను ఛాలెంజ్ గా తీసుకోవాలన్నారు. ఇతర జిల్లాలకు చెందిన క్రైంబృందాలతో పోటీపడాలన్నారు. కమిషనరేట్ లోని క్రైం బృందాల పనితీరు మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఎక్కడ ఏ నేర సంఘటన జరిగాని అలాంటి నేరాలు ఎలాంటి తరహా నేరస్థులు పాల్పడుతారో నిర్ధారణకు రావాలని తెలిపారు. నేరాలకు పాల్పడితే పట్టుబడుతామనే భయం దోపిడిదొంగల గుండెల్లో ఏర్పడాలని ఆయన తెలిపారు. పరస్పర సహకారంతో పనిచేస్తే ఆశించిన ఫలితాలను సాధించవచ్చని, సహనంతో పనిచేస్తే నేరాలను ఛేదించవచ్చని తెలిపారు. అన్నివర్గాలకు చెందిన ప్రజలతో సత్సంబంధాలను కొనసాగిస్తూ ప్రత్యేక సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. క్రైం విభాగాలకు చెందిన పోలీసులు నూతనోత్సాహంతో పనిచేయాలని చెప్పారు. ఇతర జిల్లాలో జరుగుతున్న నేరాలను పరిశీలిస్తూ అలాంటి తరహా నేరాలు ఇక్కడ జరుగకుండా నియంత్రణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. జైలునుండి విడుదలైన పాతనేరస్థుల కదలికలపై నిఘా ఉంచాలని చెప్పారు. వాహనాల తనిఖీ సందర్భంగా సరైన ధృవపత్రాలు లేని, నెంబర్ ప్లేట్ టాంపరింగ్‌లకు పాల్పడిన వాహనదారులను క్షుణ్ణంగా విచారించాలని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ కు నేర విభాగానికి చెందిన పోలీసులను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. నేర విభాగంలో పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు వారి పేర్లను దృష్టికి తీసుకరావాలని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ డిసిపి జి.చంద్రమోహన్, ఏసిపి పి. కాశయ్య, సిసిఎస్ ఇన్స్‌పెక్టర్ పుల్లయ్య, క్రైం విభాగాలకు చెందిన పోలీసులు పాల్గొన్నారు.

# పోస్టల్ సుకన్య ఖాతా.. ఆడబిడ్డలకు కొండంత అండ

### - ప్రత్యేక మేళాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
### : పోస్టల్ సూపరింటెండెంట్ వేంకటేశ్వర్లు




కరీంనగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 8 (మనం న్యూస్): బేటి బచావో..బేటీ పడావో నినాదంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సుకన్య సమృద్ధి యోజన ఖాతా అమ్మాయిల భవిష్యత్తుకు కొండంత అండగా, తల్లిదండ్రులకు కూడా అంతే ధీమాగా నిలుస్తోందని కరీంనగర్ పోస్టల్ సూపరింటెండెంట్ వై.వేంకటేశ్వర్లు తెలిపారు. ఈ ఖాతాలో మరింత మందిని భాగస్వాములను చేసేందుకు తపాలా శాఖ ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ప్రత్యేక మేళా సందర్భంగా ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న మేళాను సద్వినియోగం చేసుకుని అప్పుడే జన్మించిన శిశువు నుంచి పదేళ్ల లోపు వయసున్న ఆడపిల్లల పేరిట ఖాతాలు తెరవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా పలు పథకాల్లో మొదటి స్థానంలో నిలిచిన కరీంనగర్ డివిజన్ తపాల శాఖ సుకన్య ఖాతాల్లో కూడా మొదటి స్థానంలో నిలిచేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. తపాల శాఖలో అనేక పథకాలు అందుబాటులో ఉన్నాయని, ముఖ్యంగా ఆడపిల్లల కోసం ప్రవేశపెట్టిన సుకన్య సమృద్ధి యోజన ఖాతా తల్లిదండ్రులకు అండగా ఉంటుందని తెలిపారు. ప్రతి అమ్మాయికీ సుకన్య ఖాతా తెరవాలనే లక్ష్యంతో భారత తపాల శాఖ గురు, శుక్రవారాలు ప్రత్యేక మేళాలు నిర్వహించాలని ఆదేశించిన మేరకు కరీంనగర్ డివిజన్ వ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. 250 రూపాయలతో ఖాతా ప్రారంభం చేసుకోవచ్చని, ఆ తరువాత నెలకు వీలైనంత డబ్బు జమ చేయవచ్చని, ఏడాదికి లక్షన్నర వరకు జమ చేసుకోవచ్చని, అలా 15 సంవత్సరాలు జమ చేయాల్సి ఉంటుందని, ఆ తరువాత ఆరు సంవత్సరాల వడ్డీతో కలిపి అమ్మాయి కి 21 సంవత్సరాలు నిండిన తర్వాత పూర్తి మెచ్యూరిటీ డబ్బు చెల్లించనున్నట్లు ఆయన వివరించారు. ఈ మధ్యలో అమ్మాయి పైచదువుల కోసం వడ్డీ తో కలిపి యాభై శాతం వరకు, వివాహం కోసం పూర్తి మొత్తం తీసుకునే అవకాశముంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు దగ్గరలోని పోస్టాఫీసుల్లో సంప్రదించాలని, అమ్మాయిల భవిష్యత్తుకు భరోసాగా, అండగా ఉండే ఈ సుకన్య పథకంలో చేర్పించి తల్లిదండ్రులు ధీమాగా ఉండాలని వేంకటేశ్వర్లు సూచించారు.

## కెసిఆర్, కెటిఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం



గంబీరావుపేట, ఫిబ్రవరి 9 (మనం న్యూస్):మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలను 3వేల రూపాయలకు పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గురువారం గంభీరావుపేట మండల కేంద్రంలో కార్మికులు ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రి కెటిఆర్ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట కార్యక్రమం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శులు గోట్టె సంతోష, మిట్టపల్లి వనిత, పంపరి లక్ష్మి, గంగవ్వ, కొత్తపల్లి నరసవ్వ, రాజమణి, మహేశ్వరి, సునీత, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పాపాగారి వెంకటస్వామి గౌడ్, ఉప సర్పంచ్ సింగారపు నాగరాజుగౌడ్, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పెద్దవేని వెంకటి యాదవ్, వార్డు సభ్యురాలు పిట్ల శ్రీమతి, పిట్ల బాబు, పంచాయితీ కో-ఆప్షన్ సభ్యులు శనిగరం ఆనందం, సెస్ ప్రతినిధి సిరిపురం అంజయ్య, బిఆర్ఎస్ సోషల్ మీడియా ఇంఛార్జి దోసల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లుపల్లి సెస్ ప్రతినిధిగా రవికుమార్



గంభీరావుపేట, ఫిబ్రవరి 9 (మనం న్యూస్): గంభీరావుపేట మండలం మల్లు పల్లి గ్రామ సెస్ ప్రతినిధిగా మరాటి రవికుమార్ ఎన్నికయ్యారు. గురువారం సెస్ ప్రతినిధి కోసం ఎన్నిక నిర్వహించగా రవికుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొల్లు సత్తయ్య, సీనియర్ నాయకులు జంగంపల్లి శేఖర్ గౌడ్ నాయకులు రమేష్, రాజయ్య,రాజు గ్రామస్తులు ముత్తయ్య, మరాఠీ రాములు, గడ్డి స్వామి, బొల్లు చిన్న సత్తయ్య, బురవేని రాజయ్య, బరవెని శ్రీను, బొల్లు శ్రీనివాస్, మరాఠీ శ్రీనివాస్, గణేష్, బరవేని ఎల్లయ్య, బోల్లు మహేష్, మరాఠీ పర్వ రాములు,పాత బాల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

### వారం రోజుల్లో డబుల్ బెడ్ రూంలు కేటాయించకపోతే

## ప్రజలు ఆక్రమణలు ప్రారంభిస్తారు

### మాజీ ఐఎఎస్ అధికారి ఆకునూరి మురళి



కరీంనగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 9 (మనం న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూంలను వారం రోజుల్లోగా కేటాయించాలని, లేని పక్షంలో ప్రజలే వాటిని ఆక్రమించుకుంటారని మాజీ ఐఎఎస్ అధికారి అకునూరి మురళి వ్యాఖ్యానించారు. అర్హులైన నిరుపేదలకు ఇండ్లను కేటాయించడానికి పాలకులు ఎందుకు వెనుకాడుతున్నారని ఆయన ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూంలు కేటాయించాలని కోరుతూ బహుజన కార్మిక సంఘం నాయకులు జక్కనపల్లి గణేష్, కన్నం లక్ష్మణ్, ఎండి.రఫీల ఆధ్వర్యంలో కార్మికులు కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మురళి మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా 33 జిల్లాల్లో అర్హులైన వారందరి కీ తక్షణమే డబుల్ బెడ్ రూంలు, ఇండ్ల స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అనేక మంది కార్మికులు, నిరుపేదలు నిలువ నీడలేకుండా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం వారికి ఆశ్రయం కల్పించడంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా అర్హులైన వారందరికీ వారం రోజుల్లోగా డబుల్ బెడ్ రూంలు కేటాయించాలని మురళి డిమాండ్ చేశారు.

### అనుమతులు లేకుండా ఆందోళనలు

## చేపడితే కేసులు తప్పవు

### ఎస్సై రమాకాంత్




కోనరావుపేట, ఫిబ్రవరి 9 (మనం న్యూస్): ముందస్తు అనుమతులు లేకుండా ప్రజా రవాణాకు ఇబ్బంది కలిగించే విధంగా రోడ్డుపై బైఠాయించి ధర్నా, రాస్తారోకోలు నిర్వహించిన వారిపై కేసులు నమోదు చేస్తామని కోనరావుపేట ఎస్సై ఎస్ రమాకాంత్ హెచ్చరించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమయానికి బస్సులు నడపాలని డిమాండ్ చేస్తూ ఎలాంటి అనుమతి లేకుండా మండలంలోని నిమ్మపల్లి గ్రామంలో రాస్తారోకో నిర్వహించి రవాణాకు ఇబ్బందులు కలిగించిన ఎబివిపి మండల కన్వీనర్ పూజం కార్తీక్, నాగండ్ల భూమేష్, బండ సత్తయ్య, గౌరు బక్కయ్య, దర్ర రవితో పాటు పలువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆందోళనలు నిర్వహించే వారు ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని, లేని పక్షంలో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన మంజులరెడ్డి



సైదాపూర్, ఫిబ్రవరి 9 (మనం న్యూస్ ): సైదాపూర్ మండలం కేంద్రంలోని నిరుపేద కుటుంబాలకు చెందిన బత్తుల రవీందర్, వెన్నంపల్లి గ్రామానికి చెందిన బత్తుల పద్మ ఇటీవల మరణించగా, సామాజిక సేవకురాలు కర్ణకంటి మంజులరెడ్డి గురువారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో బొల్ల హరీష్ , వెన్నంపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు జంపాల శ్రీనివాస్. మేడవేణి నరేష్ ,ఎగురి రవీందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, పొన్నాల అశోక్, శ్రవణ్ రెడ్డి, శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



తిమ్మాపూర్, ఫిబ్రవరి 9 (మనం న్యూస్): పొలం దున్నిస్తున్న క్రమంలో విద్యుత్ షాక్ తగిలి రైతు మృతి చెందిన ఘటన కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. నుస్తులాపూర్ గ్రామానికి చెందిన తుమ్మనపల్లి రామారావు (70) అనే రైతు తన వ్యవసాయ క్షేత్రంలో ట్రాక్టర్ తో పొలం దున్నిస్తుండగా విద్యుత్ వైర్లు తెగిపడటంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## హోంగార్డ్ మృతి



శంకరపట్నం, ఫిబ్రవరి 9 (మనం న్యూస్): విద్యుత్ షాక్ తగిలి, చికిత్స పొందుతున్న హోం గార్డు గురువారం మృతి చెందారు. శంకరపట్నం మండలం ముత్తారం గ్రామానికి చెందిన బొంగోని తిరుపతి (53 )హోంగార్డుగా కరీంనగర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. గత ఆదివారం తన సొంత వ్యవసాయ బావి వద్ద పనులు చూసుకుంటుండగా ప్రమాదవశాత్తు కరెంటు షాక్ తగిలి అస్వస్థకు గురయ్యాడు. మరుసటి రోజు కరీంనగర్ లోని టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహించుకుని తిరిగి బైకుపై ఇంటికి వస్తుండగా తీవ్రమైన తలనొప్పితో పక్షవాతం రావడం గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ లోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు మెదడుకు శస్త్ర చికిత్స జరిపారు. శస్త్ర చికిత్స అనంతరం హోంగార్డ్ తిరుపతి కోమాలోకి వెళ్లి గురువారం మధ్యాహ్నం మరణించాడు. గత కొన్ని సంవత్సరాలుగా కేశవపట్నం పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన హోంగార్డ్ తిరుపతి మరణం పట్ల స్థానిక ఎస్సై డి.చంద్రశేఖర్, సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# పన్ను ఎగవేతదారులకు మోడీ అండగా నిలుస్తున్నారు

## పవర్ లూమ్ టెక్స్ టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రవీణ్

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 9, (మనం న్యూస్): పన్ను ఎగవేతదారులకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అండగా నిలుస్తున్నారని తెలంగాణ పవర్‌లూమ్, టెక్స్ టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరు ప్రవీణ్ ఆరోపించారు. పార్లమెంటు సమావేశంలో ఆదానీ విషయంలో పార్లమెంట్ విచారణ కమిటీ వేయాలని కోరినప్పటికీ, మోడీ సమాధానం చెప్పకుండా మౌనం వహించడం వెనుక కారణం ఏమిటని ప్రశ్నించారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రవీణ్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ నాయకులు, కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై అసహనం వ్యక్తం చేశారు. విజయ్ మాల్యా తో పాటు అనేకమంది ఎగవేతదారులను దేశం దాటించిన ఘనత ప్రధాని మోడీకే దక్కిందన్నారు. నల్లధనం తీసుకొచ్చి పేదల ఖాతాలో 15 లక్షలు వేస్తామన్న హామీ సంగతి ఏమైందన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను కారుచౌకగా అమ్మేస్తూ మోడీ అనుయాయులకు 19 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేశారని విమర్శించారు. దేశాన్ని కుదిపేవేసిన ఆదాని వ్యవహారంలో పార్లమెంట్ సాక్షిగా ప్రతిపక్షాలు పార్లమెంటు స్థాయి విచారణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని కోరిన సమాధానం చెప్పకుండా ప్రధాని మోడీ మౌనం వహించాలని అన్నారు. దేశం పేరు ధర్మం పేరు చెబుతూ ఎగవేత దారులకు అండగా ఉంటున్నారని అన్నారు. మరోవైపు రాష్ట్రంలోనూ బిజెపి నాయకులు టిఆర్ఎస్ పార్టీపై అవాకులు చెవకులు మాట్లాడుతున్నారని బ్యాంకులకు 18 కోట్లు ఎగవేసిన రాణి రుద్రమ విషయాన్ని గుర్తు చేశారు. జడ్పీ చైర్పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ



మాట్లాడుతూ సంక్షేమం కోసం పనిచేస్తున్న టిఆర్ఎస్ ప్రభుత్వం పట్ల మంత్రి కేటీఆర్ పట్ల మరోసారి తప్పుడు విమర్శలు చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెప్తారని అన్నారు. సమావేశంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బత్తుల వనజ, కౌన్సిలర్ దిడ్డి మాధవి, మ్యాన రవి, ఎండి సత్తార్, సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

## సమయానుకూలంగా బస్సులు నడపాలని విద్యార్థుల రాస్తారోకో



కోనరావుపేట, ఫిబ్రవరి 9 (మనం న్యూస్): సమయానుకూలంగా ఆర్టీసీ బస్సులు నడపాలని డిమాండ్ చేస్తూ కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామంలో విద్యార్థులు గురువారం రోడ్డుపై బైఠాయించి, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ సరైన సమయంలో బస్సులు నడపక పోవడం వల్ల విద్యాసంస్థలకు వెళ్లి రావడానికి తీవ్ర ఇబ్బందులెదురవుతున్నాయన్నారు. ముఖ్యంగా సాయంత్రం సమయంలో సకాలంలో బస్సులు రాకపోవడంతో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందన్నారు. ఇదే విషయమై డిపో మేనేజర్ ను చరవాణిలో సంప్రదించగా సానుకూలంగా స్పందించి బస్సులు నడుపుతామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగండ్ల భూమేష్, గౌరు బక్కయ్య, బండ సత్తయ్య, దర్ర రవి, ఎబివిపి కన్వీనర్ పూజం కార్తిక్, విద్యార్థులు పాల్గొన్నారు.

## హోరాహోరీగా గ్రామ సెస్ ప్రతినిధుల ఎన్నిక



కోనరావుపేట ఫిబ్రవరి 9 (మనం న్యూస్): రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని సుద్దాల గ్రామంలో సెస్ ప్రతినిధుల ఎన్నికలు హోరా హోరీగా జరిగాయి. గ్రామంలో ఇద్దరు ప్రతినిధులను ఎన్నుకోవాల్సి ఉండగా ఎర్రవెల్లి కిషన్ ను ఏకగ్రీవంగా గ్రామస్తులు ఎన్నుకున్నారు. కానీ మరో ప్రతినిధి ఎన్నికకు ముగ్గురు వ్యక్తులు పోటీలో ఉండగా వంగాల భూమేష్‌కు 73 ఓట్లతో ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి సత్వరమే కృషి చేస్తామన్నారు. గ్రామ సర్పంచ్ ఉప్పుల దేవలక్ష్మి శంకర్, ఉప సర్పంచ్ ఎర్రవెల్లి నాగరాజు, ఎంపిటిసి సభ్యులు కాశ వేణి మమత మహేష్‌లు ఎన్నికైన ప్రతినిధులను శాలువాలతో సత్కరించారు.

## బిఎస్పీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



ఇల్లంతకుంట, ఫిబ్రవరి 9 (మనం న్యూస్ ): బిసి రిజర్వేషన్లను 52 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ బిఎస్పీ మండల అధ్యక్షులు చిలుకపెల్లి ప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ జిల్లా కార్యదర్శి ఏనుగుల లింగన్న, కార్యవర్గ సభ్యులు కొంపల్లి పరశురాములు, మానకొండూర్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి నిశాని రాజమల్లు, సీనియర్ నాయకులు గజ్జల సత్తన్న, మండల నాయకులు దొంతి జాన్, రాయినిపట్ల రాజ్ కుమార్, గజ్జల శశికుమార్, డిల్లవేని రామన్న, అంతగిరి ఆదర్శ్, ఒగ్గు కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సంకష్టహర చతుర్థి పూజలు



కొత్తపల్లి, ఫిబ్రవరి 9 (మనం న్యూస్): సంకష్టహర చతుర్థి సందర్భంగా గురువారం కరీంనగర్ మండలం నగునూర్‌లోని పరివార సమేత శ్రీ దుర్గాభవానీ దేవాలయంలోని లక్ష్మిగణ పతికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకం, ఫలపంచామృతాభిషేకం, విశేష హారతి, పూజ కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు పవన్‌కృష్ణశర్మ వైభవంగా నిర్వహించారు. ఈ పూజల్లో ఆలయ ఫౌండర్, కమిటి బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణ పనుల్లో జాప్యాన్ని నిరసిస్తూ ఎంపిటిసి సభ్యురాలి నిరాహారదీక్ష



ఇల్లంతకుంట ఫిబ్రవరి 9 (మనం న్యూస్): రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామం నుండి కిష్టపూర్ వరకు నిర్వహిస్తోన్న రోడ్డు పనుల్లో తీవ్ర జాప్యాన్ని నిరసిస్తూ ఎంపిటిసి సభ్యురాలు కాశ సుమలత మల్లేశం ఆధ్వర్యంలో గురువారం నిరాహారదీక్షను ప్రారంభించారు. ఈ శిబిరంలో ఆయా గ్రామాల ప్రజలు, రైతులు పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సుమలత మాట్లాడుతూ రేపాక గ్రామం నుంచి కిష్టాపూర్ వరకు రోడ్డును ఏర్పాటు చేస్తామని ప్రకటించిన అధికారులు ఆరు మాసాలైన పట్టించుకోవడం లేదన్నారు. రోడ్డుపై కంకర పోసి వదిలేయడంతో ప్రజలు ఆ దారిన వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులెదుర్కోవాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే రోడ్డు పనులు పూర్తి చేయాలని, లేని పక్షంలో రోడ్డు ఏర్పడే వరకు నిరాహార దీక్షను కొనసాగిస్తామని ఆమె హెచ్చరించారు.

## దేవాలయ కాంపౌండ్ వాల్ ను వెంటనే నిర్మించాలి

### - ప్రమాద ఘటనలపై విచారణ చేపట్టాలి

### : బిజెపి రాష్ట్ర నాయకులు బేతి మహేందర్ రెడ్డి



కరీంనగర్, ఫిబ్రవరి 9 (మనం న్యూస్): కరీంనగర్ బైపాస్ రోడ్డులోని అభయాంజనేయ స్వామి దేవాలయ కాంపౌండ్ వాల్‌ను తక్షణమే నిర్మించాలని బిజెపి రాష్ట్ర నాయకులు బేతి మహేందర్ రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గురువారం తెల్లవారుజామున మహారాష్ట్ర కు చెందిన లారీ ఢీకొట్టడంతో దేవాలయ కాంపౌండ్ కూలిపోయిందని, భజరంగదళ్ కో-కన్వీనర్ గుజ్జేటి రాజేందర్‌తో కలిసి తాను అక్కడి పరిస్థితి పరిశీలించి, లారీకి సంబం ధించిన వ్యక్తులతో మాట్లాడినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు కాంపౌండ్ వాల్ నిర్మిస్తామని పోలీసులకు లిఖితపూర్వకంగా రాసిచ్చినట్లు తెలిపారు. రోడ్డుకు ఆనుకొని ఎన్నో ఇతర మతాల ప్రార్థన మందిరాలు ఉన్నప్పటికీ హిందు దేవాలయాలకే ప్రతిసారి ప్రమాదా లు జరగటం పై పోలీసులు సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

## నల్లబ్యాడ్జీలతో పండిత, పిఇటిల నిరసన



మెట్ పల్లి, ఫిబ్రవరి 9 ( మనం న్యూస్ ): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భాష పండితులు పి ఈ టీ లు గత 25సంవత్సరాలు నుండి ప్రమోషన్ కు నోచుకోక శ్రమ దోపిడీకి గురి అవుతున్నారని ఉపాధ్యాయ పండిత పరిషత్ టీఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు అల్లకట్టు సత్యనారాయణ అన్నారు. గురువారం వారు పనిచేస్తున్న పాఠశాలల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పండిత, పిఇటి జెఎసి పిలుపు మేరకు ఈ రోజు నుండి నల్ల బ్యాడ్జి లతో విధులకు హాజరు అవుతున్నా మన్నారు జాబ్ చార్ట్ ప్రకారం 6,7,8, తరగతులు మాత్రమే బోధిస్తామని 9,10తరగతుల సహాయ నిరాకరణ చేస్తున్నామని ఫిబ్రవరి 1వ తారీఖు నుండి నేటికీ 9వ రోజు కొనసాగుతున్న దని తెలిపారు ప్రభుత్వం వెంటనే పండితులకు పి ఈ టీ లకు ఈ షెడ్యూల్ లలో నే పదోన్నతి లు ఇవ్వాలని కోరారు ఈ కార్యక్రమం లో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ టీ ఎస్ జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగందుల రాజేంద్ర ప్రసాద్, పి ఈ టీ ల జిల్లా అధ్యక్షులు సుంచు అశోక్, పడాల విశ్వ ప్రసాద్, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, అందుర్తి స్వామి తెలుగు, హిందీ, ఉర్దూ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అల్పాహారం అందజేత



కోరుట్ల ఫిబ్రవరి 9 (మనం న్యూస్ ): మన ప్రెస్ క్లబ్ కోరుట గౌరవ అధ్యక్షులు ఉరుమడ్ల శ్రీనివాస్, అధ్యక్ష కార్యదర్శులు చిలివేరి లక్ష్మీరాజం, ఆల్లే రాము ఆధ్వర్యంలో కోరుట్ల పట్టణం లోని ప్రభుత్వ హాస్పిటల్ లోని బాధితులకు, సిబ్బందికి గురు వారంఅల్పాహారం అందించారు. ఈ సందర్భంగా గౌరవ సలహాదారులు అనిల్ కుమార్ మాట్లాడుతూ సేవ చేయడంలో చాలా సంతృప్తి ఉంటుందని మన ముందు మన ప్రెస్ క్లబ్ ఆధ్వ ర్యంలో సేవా కార్యక్రమాలను విస్తరిస్తామని స్పష్టం చేశారు. సామాజిక సేవా రంగంలో ముందుండాలనే సంకల్పంతో ఇట్టి అల్పాహార కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా ప్రభుత్వ హాస్పిటల్స్ సూపరిండెంట్ డాక్టర్ సునీత, మన ప్రెస్ క్లబ్ కోరుట్ల ఉపాధ్యక్షులు చిట్యాల సాయి కృష్ణ, కోశాధికారి పెడిమల్ల రాజు పాత్రికేయులు కొండ్లేపు అర్జున్, మిట్టపల్లి బుచ్చిరెడ్డి, పాతర్ల నరేష్, చిట్యాల గంగాధర్, కొండ్లెపు సాయి కృష్ణ, మహమ్మద్ హుస్సేన్, రిహాన్, తదితరులు ఉన్నారు.

## ఘనంగా ఎల్లమ్మ తల్లి జాతర మహోత్సవం



కోరుట్ల, ఫిబ్రవరి 9 (మనం న్యూస్)ః కోరుట్ల మండలంలోని సంగెం గ్రామంలో గురువారం ఎల్లమ్మ తల్లి జాతర మహోత్స వాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి గౌడ కులస్తుల ఇంటికి సామూహికంగా గౌడ కులస్తులు వెళ్ళి రేణుకా ఎల్లమ్మ తల్లిని భక్తిశ్రద్ధలతో మంగళహారతులతో ఊరేగింపుగా గడ పావనం నిర్వహించారు. అనంతరం గౌడశెట్టి బృందం సభ్యులు డప్పుచప్పుళ్లతో జోగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ చెప్యాల నరసయ్య, గౌడ సంఘం నాయకులు వల్లకొండ శ్రీహరి గౌడ్, శ్రీపతిగౌడ్, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, సుధవేని భూమయ్య గౌడ్, దామోదర్, హరీష్, ముకేష్, ప్రశాంత్, శంకర్, లింగం, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



శంకరపట్నం, ఫిబ్రవరి 9 (మనం న్యూస్)ః శంకరపట్నం మండలం కరీంపేట గ్రామంలో మంజూరైన సిసి రోడ్ల నిర్మాణ పనులను గురువారం జడ్పీటిసి సభ్యులు లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభ్యులు రసమయి బాలకిషన్ చొరవతో కరీంపేట గ్రామానికి సిసి రోడ్ల నిర్మాణం కోసం 20 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయితే మరిన్ని అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు కానున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంట మహిపాల్, మండల కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్ ఖాజాపాషా, సర్పంచులు వనపర్తి మల్లయ్య, కలకుంట్ల రంజిత్ రావు, ఎంపిటిసి సభ్యులు గాండ్ల తిరుపతి, ఉపసర్పంచ్ చింతం కుమార్, వార్డు సభ్యులు చింతం రాజేశం, స్వరూప, మండల నాయకులు ఉమ్మెంతల సతీష్ రెడ్డి, మొకిరాల కిషన్ రావు, గోపి శ్రీనివాస్, జగదీశ్వర్, రాజు, పంచాయతి కార్యదర్శి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని

# ఎబివిపి ధర్నా

**- ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేసేందుకు యత్నించిన విద్యార్థులు**

**- భగ్నం చేసిన పోలీసులు**



కరీంనగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 9 (మనం న్యూస్)ః రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో కెసిఆర్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని నిరసన వ్యక్తం చేస్తోందని నిరసిస్తూ ఎబివిపి ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేసేందుకు యత్నించగా, పోలీసులు నిలువరించారు. అనంతరంస్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యులు మల్యాల రాకేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు గడుస్తున్నా విద్యారంగాన్ని అభివృద్ధి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా గత సంవత్సరంలో పోల్చుకుంటే ఈ సంవత్సరం బడ్జెట్ లో విద్యారంగానికి కనీసం ప్రాధాన్యత ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. విద్యార్థులకు రావాల్సిన ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్షిప్‌లు దాదాపు 5వేల300 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, అదేవిధంగా యూనివర్సిటీల్లో ప్రభుత్వ డిగ్రీ, ఇంటర్మీడియట్ కళాశాలు, పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు లేకున్నప్పటికీ వాటిని సమకూర్చడంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు గొప్పలు చెప్పుకుంటూ పేపర్ల ప్రకటనలు మాత్రమే పరిమితం అవుతున్నారని, సమస్యలను ఏమాత్రం పట్టించుకోవట్లేదని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేని పక్షంలో కరీంనగర్ నుంచే పెద్ద ఎత్తున విద్యార్థి ఉద్యమాన్ని ప్రారంభిస్తామని రాకేష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పూసల విష్ణు, రేషవేని వేణు, బామండ్ల నందు నగర జోనల్ ఇంచార్జులు శివ, సాయి, శ్రీవర్ధన్, నగర సంయుక్త కార్యదర్శి నాగరాజు, వంశీ, రాకేష్, అబ్దుల్, రాజు, శివాజీ ,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## షుగర్ టెస్ట్ మిషన్‌లు అందించిన టిఆర్ఎస్ బహుజన నాయకుడు



రామగిరి,ఫిబ్రవరి 09 మనం న్యూస్ ః రామగిరి మండలం కల్వచేర్ల గ్రామంలో బహుజన టిఆర్ఎస్ నాయకుడు కన్నూరి శ్రీశైలం స్వేరో గురువారం రెండు షుగర్ టెస్ట్ మిషన్ లను సర్పంచ్ గంట పద్మ వెంకటరమణ రెడ్డికి అందించారు. స్వచ్ఛంద సేవలో భాగంగా తన సొంత ఖర్చుతో మా నాన్న కన్నూర్ మల్లేష్ జ్ఞాపకార్థగా రెండు మిషన్‌లను అందించారన్నారు. ఇప్పటికే జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్‌ను ఆదర్శంగా తీసుకొని సెంటనరీకాలనీ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ముల్మూరి శ్రీనివాస్,రత్నాపూర్ సర్పంచ్ పల్లే ప్రతిమా పీవీరావులకు ఇటువంటి నాలుగు మిషన్ లను అందించానని ఆయన తెలిపారు. ఈ మిషన్‌ను అందించిన శ్రీశైలంను సర్పంచ్ గంట పద్మ వెంకటరమణ రెడ్డి,ఎంపీటీసీ కొట్టే సందీప్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సందీప్ కొట్టే,సెక్రటరీ సతా శ్రీనివాస్,స్థానిక బీఎస్పీ మంథని నియోజకవర్గం ఇంచార్గ్ జనగామ రవికుమార్,నాయకులు ఏఎన్ఎం తిరుమల,ఆశ వర్కర్లు శారధ,గ్రామపంచాయతీ సిబ్బంది కుంట ఓదెలు రాజయ్య, శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## మంథని పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన పెద్దపల్లి డీసీపీ

**-ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలి**

**-ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని పోలీస్ సిబ్బందికి సూచన**

**- పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్**



మంథని,ఫిబ్రవరి 09 మనం న్యూస్ ః పెద్దపల్లి డీసీపీ గా నూతనంగా బాధ్యతలు తీసుకున్న వైభవ్ గైక్వాడ్ మొదటి సారిగా మంథని పోలీస్ స్టేషన్ ను గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్ తో కలిసి గురువారం పోలీస్ స్టేషన్ పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది పనితీరు,నమోదయ్యే కేసుల వివరాలకు సంబంధించి అడిగా తెలుసుకున్నారు. అదేవిధంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని సీసీ కెమెరాల పనితీరు,నేరాల నియంత్రణ,రోడ్డు ప్రమాదాల గురించి తీసుకుంటున్న నివారణ చర్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. క్రమశిక్షణగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని,విర్ణకల్స్ విధానం,5ఎస్ విధానాలపై మరింత అవగాహన పెంపొందించుకునేందుకు అధికారులకు,సిబ్బందికి శిక్షణ అందజేయాల్సి ఉంటుందని ఈ సందర్భంగా సూచించారు. ప్రజలు అందించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని శాంతి భద్రతల పరిరక్షణ బాధ్యత పోలీసులపై ఉందన్నారు. నేరాల నియంత్రణ కోసం సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజల్లో అవగాహన పెంచాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంథని సీఐ సతీష్,ఎస్ఐలు వెంకటేశ్వర్లు,రాణిలు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదానం

కరీంనగర్, ఫిబ్రవరి 9 (మనం న్యూస్)ః జిల్లా కేంద్రంలోని వివేకానంద పిజి, డిగ్రీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన 42వ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్. శ్రీనివాస్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి వ్యక్తి ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి, ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ రాపోలు గోపికష్ణ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి రక్తనిధి కేంద్రంలో రక్తం కొరత కారణంగా, వారి అభ్యర్థన మేరకు శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ 42వ రక్తదాన శిబిరంలో 30 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు , విద్యార్థులు రక్తదానం చేసి సామాజిక సేవా నిరతిని చాటారని కొనియాడారు. ఈ




కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కచ్చు సతీష్ కుమార్, ఎస్.రాజు, ఏసిఓ.బి.సంపత్ కుమార్, డాక్టర్ ఎండి.అలీఖాన్, బి.రామేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## సంతరవిదాస్ జీవితం అందరికి ఆదర్శం



హుజూరాబాద్‌రూరల్,ఫిబ్రవరి 9,(మనం న్యూస్) : అధ్యాత్మిక యోదుడు ధర్మరక్షులు, మాత మార్పిడులకు వ్యతిరేకంగా ఉద్యమం చేసిన గొప్ప మహానీయుడు సంత రవిదాస్ జీవితం అందరికి ఆదర్శమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో సంత రవిదాస్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని చర్మకార వృత్తికారులను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మ్లాడుతూ దశాబ్దాల క్రితం భారతదేశంలో భక్తి ఉద్యమాన్ని కొత్త పుంతలు తొక్కించిన అద్యాత్మిక యోధుడని పేర్కొన్నారు. భక్తికి, జ్ఞానానికి కులం ప్రధానం కాదని, సన్మార్గంలో భగవంతుడిని చేరుకోవచ్చని సూచించిన మహానీయుడన్నారు. సంత్ రవిదాస్ నేతృత్వంలో సాగిన పురాగమన ఉద్యమంతో మత మార్పిడులు పూర్తిగా ఆగిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగిశెట్టి రాజు, ముత్యం రావు, జెల్ల సుధాకర్, తూర్పాటి రాజు, తూముల శ్రీనివాస్, పల్నేని దేవేందర్‌రావు, దామెర అనురాగ్, రోహిత్, తిప్పపతిని రాజు, యాళ్ల సంజీవరెడ్డి, సబ్బాని రమేష్, పోతుల సంజీవ్, గంగిశెట్టి ప్రభాకర్, సంపత్, వొడ్నాల చంద్రిక, పంజాల మనోజ్, వొడ్నాల విజయ్, గొట్టే రవీందర్, గడ్డం సమ్మయ్య, సిరిపాటి వేణు, పవన్‌కుమార్, కొలిపాక శ్రీనివాస్, ఆవుల సదయ్య, వెంకట్, చంద్రగిరి కుమార్, ఐలయ్య, బాబార్, ఉమాశంకర్, పల్లెపు బాస్కర్, నల్ల అజయ్ తదితరులు ఉన్నారు.

## కరాటేతో ఆత్మరక్షణ



హుజూరాబాద్‌రూరల్,ఫిబ్రవరి 9,(మనం న్యూస్) : మండలంలోని చెల్పూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కరాటే శిక్షణ తరగతులు ప్రారంభమైనట్లు హెచ్ఎం అంజయ్య తెలిపారు. కలెక్టర్ ఆదేశానుసారం బాలికలకు ఆత్మరక్షణ కోసం కరాటే తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ ఎస్కే జలీల్‌లు ఉన్నారు.

## విద్యుత్‌షాక్‌కు గురైన కార్మికుని పరామర్శించిన ఎమ్మెల్యే

పెద్దపల్లి,ఫిబ్రవరి09(మనంన్యూస్): ఇటీవల విద్యుత్‌షాక్‌కు గురై హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పారిశుద్ధ్య కార్మికుడు సందప్‌ను గురువారం రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పరామర్శించారు. సందిప్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అలాగే సందిప్ కుటుంబ సభ్యులు ఓదార్చి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.

## కేసీఆర్‌ను విమర్శించే స్థాయి రేవంత్‌రెడ్డికి లేదు

హుజూరాబాద్‌టౌన్,ఫిబ్రవరి 9,(మనం న్యూస్) : సీఎం కేసీఆర్‌ను విమర్శించే స్థాయి రేవంత్‌రెడ్డికి లేదని ముదిరాజ్ మహాసభ జిల్లా నాయకులు కొలిపాక సమ్మయ్య ముదిరాజ్ అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టడానికి పాదయాత్రలను చేపట్టారన్నారు. పాదయాత్రల ద్వారా ప్రభుత్వాలు ఏర్పడవని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగానికి సైతం కేసీఆర్ సిద్ధమైన పరిస్థితులను వివరించారు. తెలంగాణలో జరిగిన అభివృద్దే దేశమంతా జరగాలన్న ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి బీఆర్ఎస్‌ను స్థాపించారన్నారు. రేవంత్‌రెడ్డి నోటిని అదుపులో పెట్టుకొని మాట్లాడాలన్నారు.

# ఉచిత శిక్షణను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి

పెద్దపల్లి, ఫిబ్రవరి 09 (మనం ప్రతినిధి): జిల్లాలోని నిరుద్యోగులకు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ విద్యార్థులకు సూచించారు. పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రూప్-2,3,4సర్వీస్ ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షల కొరకు ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణా శిబిరాన్ని,డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి గురువారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్బంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ ప్రభుత్వ శాఖలలో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు గ్రూప్స్ క్రింద ఉన్నఖాళీల నియామకాలను నోటిఫికేషన్ విడుదల చేసిందని, పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు వీలుగా మన జిల్లాలో నిరుద్యోగ యువతకు ఈనెల 9నుండి మే 8వరకు గ్రూప్స్ కొరకు నాణ్యమైన శిక్షణను ఉచితంగా అందించేందుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత శిక్షణా తరగతులను ప్రారంభించామని, ఇప్పటి వరకు 69మంది విద్యార్థులు ఉన్నారని, మరో 31మ ందికి సైతం అవకాశాలు ఉన్నాయని అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. హైదరాబాద్ కేంద్రాలలో అందించే స్థాయిలో నాణ్యమైన శిక్షణను జిల్లాలో అర్హులైన పేదలకు ఉచితంగా కల్పిస్తున్నామని తెలిపారు. పోటీ పరీక్షలలో విజయం సాధించేందుకు చదవడం, రాయడం, పేపర్ ప్రజెంటేషన్‌పై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ఉంటూ, అపోహలు, అనుమానాలు వదిలి మంచి దీక్షతో పరీక్షలకుసిద్ధం కావాలని, తాను 35రోజుల పాటు శ్రమి ంచి గ్రూప్స్‌లో ఉత్తీర్ణత సాధించడం జరిగిందని తెలిపారు. పక్కా ప్రణాళిక ప్రకారం పరీక్షలకు సిద్ధమైతే 4నుంచి 5ఉద్యోగాలు సిధించే అవకాశాలున్నాయని, పోటీ పరీక్షలలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు బాగా రాణిస్తున్నారని, సమయ పాలనపై సైతం విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పరీక్షలలో ప్రతి ప్రశ్నను తప్పనిసరిగా జవాబు రాసేందుకు విద్యార్థులు సన్నద్ధం కావాలని, ఒకే చోట సమయం వృధా చేయకుండా, సదరు నైపుణ్యాలను యువత పెంచుకోవాలని ఆయన సూచించారు.

ఈకార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, కెప్టెన్ ఆర్ సంజీవ్,బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, ఎస్‌సి అభివృద్ధిశాఖ అధికారి నాగలేశ్వర్, కోచింగ్ శిక్షకులు సదానందం, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



పెద్దపల్లి, ఫిబ్రవరి 09(మనం ప్రతినిధి): ద్విచక్రవాహనాన్ని లారీ డీ కొని తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పట్టణంలోని మంథని ఫ్లై ఓవర్ వద్ద పెద్దపల్లి వైపు వస్తున్న ద్విచక్రవాహనాన్ని లారీ డీ కొనడంతో పెద్దపల్లి మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి రమేష్ (45) కాళ్లు నుజ్జు నుజ్జు అయి తీవ్రంగా గాయాలు అయ్యాయి. గాయపడిన రమేష్‌ను హుటాహుటిన పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా మార్గమద్యంలో మృతి చెందాడు. మృతుడికి బార్య స్వరూప, కూతురు ఉన్నారు. మృతి చెందిన రమేష్ మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని బందువుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

## డబుల్ బెడ్‌రూం కొరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

### 8వ వార్డు కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మీ



పెద్దపల్లి, ఫిబ్రవరి 09(మనంప్రతినిధి)8వ వార్డు ప్రజలు డబుల్ బెడ్‌రూంల కొరకు ఆన్‌లైన్‌లో అప్లికేషన్ నమోదు చేసుకోవాలని వార్డు కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మీ పిలుపునిచ్చారు. ఈ సందర్బంగా భాగ్యలక్ష్మీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్‌రూం పథకానికి అర్హులైన 8వ,వార్డు ప్రజలు పెద్దపల్లి తహాశీల్దార్ చెప్పిన ప్రకారం గురు వారం నుండి ఈనెల 15వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను చేసుకొని ప్రభుత్వం కల్పిస్తున్న ఈసదవకాశాన్ని సద్వినియో గం చేసుకోవాలని కౌన్సిలర్ సేవారత్నా బొంకూరి భాగ్యలక్ష్మీ కోరారు. డబుల్ బెడ్‌రూం ఆన్‌లైన్ కొరకు కావాల్సినవి .1,పాస్‌ఫోటో ,2,ఆధార్‌కార్డు,3,ఆహార భద్రతాకార్డు,4, కులం, 5,ఆదాయ ధృవీకరణ పత్రాలు,6, అర్జీదారు బ్యాంక్ వివరాలు, 7,ఓటరు కార్డు,8, సెల్‌నంబర్ తీసుకొని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## ఓదెల మల్లిఖార్జున స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు

### కేసీఆర్ సేవాదళం ఉపాధ్యక్షులు బొద్దుల లక్ష్మణ్



పెద్దపల్లి, ఫిబ్రవరి 09(మనం ప్రతినిధి): ఓదెల మల్లిఖార్జున స్వామి దేవాలయ ఆవరణలో శ్రీవీరభద్రస్వామి, బంగారు పోచమ్మ, శ్రీమదన పోచమ్మ ఆలయంలోని పునః ప్రతిష్ట కార్యక్రమానికి శ్రీవీరభద్ర స్వామి ఆలయ నిర్మాణ, విగ్రహదాత అకినపల్లి చంద్రశేఖర్ ఆహ్వానం మేరకు కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొద్దుల లక్ష్మణ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్బంగా బొద్దుల లక్ష్మణ్ మాట్లాడుతూ తన మిత్రుడు అయినటువంటి ఓదెల గ్రామానికి చెందిన చంద్రశేఖర్ ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడి మల్లికార్జున స్వామి మీద ఉన్న భక్తితో పురాతన కాలంలో ధ్వంసమైన శ్రీవీరభద్రస్వామి ఆలయ నిర్మాణం తన స్వంత ఖర్చులతో చేయించినందుకు వారిని అభినందించారు. అలాగే ఓదెల మల్లన్న దేవుడు చాలా మహిమగల దేవుడని, ఆదేవుని కృపా కటాక్షాలతో ప్రజలందరూ సుఖ సంతోషాలు, పాడిపంటలు సంవృద్ధిగా పండాలని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ఆలయ నిర్మాణదాత అకినపల్లి చంద్రశేఖర్‌ను శాలువాతో సత్కరించారు. ఈసందర్బంగా పీఠాధిపతి శివానంద స్వామి బొద్దుల లక్ష్మణ్‌ను అభినందించారు. ఈకార్యక్రమంలో ఓదెల మల్లికార్జునస్వామి దేవాలయ చైర్మన్ మేకల మల్లేశం, డైరెక్టర్లు, దేవాలయ ఈవో, కేసీఆర్ సేవాదళం జిల్లా అధ్యక్షులు దండే వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి చాతల్ల కాంతయ్య,చిప్ప రమేష్, అమరగాని శ్రీనివాస్, చిప్ప శ్రీకాంత్, రమేష్‌గౌడ్, బొద్దుల కైలాసం తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు కాలనీ పోరాడి సాధించుకున్నాం

### బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాతపల్లి ఎల్లయ్యయాదవ్



గోదావరిఖని,ఫిబ్రవరి09(మనంన్యూస్)గతంలో అనేక పోరాటాలు చేసి చంద్రబాబు కాలనీ స్థాపించడం జరిగిందని, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాతపల్లి ఎల్లయ్య యాదవ్ అన్నారు. గురువారం 25వ డివిజన్ చంద్రబాబు కాలనీలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ఎల్లయ్య యాదవ్ సమావేశం నిర్వహించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు కాలనీలో కరెంట్, కంకరరోడ్లు అప్పుడు మాపోరాటంతోనే సాధించామ న్నారు. రాబోయే ఎన్నికల్లో తాను బీఆర్ఎస్ పార్టీ టికెట్‌పై రామగుండం నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటి చేయనున్నానని, నిరంతరం మీకోసం పాటుపడే తనను కాలనీ ప్రజలు అశీర్వదించి గెలిపించాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో రంగు రాయమల్లు, పయ్యావుల కొమురయ్య, పొన్న సమ్మయ్య, పెండ్యాల కనకయ్య, పెండ్యాల ఓదెలు, బండా రాజయ్య, గంద్ర చిన్నయ్య, అన్నారపు సంపత్‌రెడ్డి, సందవేని రాజయ్య,మొగిలి ఓదెలు, అంజలి, ఇలవేణి రాజయ్య, బిట్లు రాజ్యలక్ష్మి, సురువు రాయమల్లు, తదితరులు పాల్గొన్నారు.

## బహుజన మహిళా అయిన తన అధికారాలను

# హరించివేస్తూ అగౌరవ పరుస్తున్నారు

### ఎంపీపీ ఆరెల్లి దేవక్క

రామగిరి,ఫిబ్రవరి 09 మనం న్యూస్ : బహుజన మహిళా రామగిరి ఎంపీపీ ఐనా నన్ను రాజకీయ వేధింపులకు గురిచేస్తూ,మా అధికారాలను హరించి వేస్తూ కొందరి ప్రోద్బలంతో మమ్మల్ని అగౌరవ పరుస్తూ ఇబ్బంది పెడుతూ సొంత నిర్ణయాలు తీసుకుంటున్న రామగిరి మండల పరిషత్ అధికారుల తీరు గురించి,అరెల్లి దేవక్క వైఫ్/ఆఫ్ కొమురయ్యగౌడ్ ,రామయ్యపల్లె వాస్తవ్యురాలు.రాగిరి మండల ఎంపీపీగా బిఆర్ఎస్ పార్టీ తరుపున మూడు సంవత్సరాలుగా పనిచేస్తున్నాను. ఎంపీపీగా పదవీ బాధ్యతలు చేపట్టినప్పటినుండి కొందరు ఓడిపోయి నా నాయకులు,అధికారులతో కలిసి మమ్మల్ని రాజకీ యంగా, కార్యాలయంలో కూడా అగౌరవపరుస్తూ మా అనుమతులు లేకుండా ఎంపీడీవో,మండల పరి షత్ అధికారులు తమ సొంత నిర్ణయాలు తీసుకుం టూ మమ్మల్ని మహిళా ఎంపీపీ అని చూడకుండా ఇ బ్బంది పెడుతున్నారు. ఐనా అన్ని తట్టుకొని, ఒడిదొ డుకులకి ఓర్చుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి,జిల్లా ఇం చార్జి మంత్రి,జడ్పీ చైర్మన్ ఆదేశాల మేరకు ప్రజల కోసం పనిచేస్తున్నాం. 08,02,2023 రోజున మండ పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో 20220- 23 సంవత్సరానికి సంబంధించిన మండల పరిషత్ నిధుల గురించి ఎంపీటీసీలతో బడ్జెట్ సమావేశం ఏర్పాటు చేశారు. దానితో పాటు 2023-24 సంబంధించి



ప్రతిపాదనలు తయారు చేశారు. కానీ ఇందులో గడిచిన సంవత్సరములు అనగా 2021,2022కి సంబంధించిన కొన్ని అనివార్య కారణాలు వల్ల ఆగిపోయిన నిధుల గురించి ముందు మాకు తెలియజేయకుండానే ఎంపీడీవో ఇనుముల రమేష్ కొందరి ప్రోద్బలంతో మమ్మల్ని అగౌరవపరుస్తూ ఆ నిధులన్నింటినీ ఎంపీటీసీలందరికి సమానంగా పంచుతాం, పనులకు సంబంధించిన వివరాలు ఇవ్వండి అని తనే నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయంలో కనీసం ఎంపీపీతో మాట మాత్రం కూడా చర్చించకుండా తానే ఎంపీడీవో అనెల మండల పరిషత్‌కు రాజకీయ ప్రతినిధిని అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంలో మేము జిల్ల జడ్పీచైర్మన్ ని సంప్రదించగా హైదరాబాద్ నుండి వచ్చాక నిర్ణయం తీసుకుందామని చెప్పారు. అయిన మా మాట వినకుండా ఒంటెద్దు పోకడలతో మా అనుమతి లేకుండా నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. మహిళబూ ఎంపీపీ అని కూడా చూడకుండా ఇలా అగౌరపరచడం మీకు సమంజసమేనా అని అడిగాతే ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో,కలెక్టర్ కి చెప్పుకుంటావో, మంత్రికి చెప్పుకుంటావో చెప్పుకో,నన్ను ఎవరూ ఏమి చేయలేరు అంటూ దుర్భాషలాడుతూ మా మండల ఎంపీటీసీలకి,నాకు గొడవ పెట్టించి చోద్యం చూస్తున్నాడు.

మేము తీసుకునే నిర్ణయాలకు,మా అనుమతి లేకుండా మండల పరిషత్ అధికారులు తమ సొంత నిర్ణయాలు తీసుకొని మాకు మాకు గొడవ పెట్టించి ఘర్షణకు దిగి దాడులకు ఉసిగొల్పుతున్నారని,పైగా నీకు చదువు కూడా చక్కగా రాదు అని హేళన చేస్తూ అవమానపరుస్తున్నారని,అంతే కాకుండా తనికి ఇష్టం వచ్చినట్లు సిబ్బందిని మార్చుతున్నాడు. ఇదేమిటాని ప్రశ్నిస్తే వారి ముందు చులకనగా మాట్లాడుతూ సిబ్బంది ముందు కూడా విలువ ఇవ్వకుండా అవమానిస్తున్నాడు. కావున ఒంటెద్దు పోకడలతో అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్న అ అధికారిని నియంత్రించాలని బహుజన మహిళా ఎంపీపీగా కోరుతున్నాను.



కరీంనగర్ జడ్పి,సిఇఓగా పనిచే స్తున్న ప్రియాంక ఐఏఎస్ హోదా లభించిన సందర్భంగా కరీంనగర్ జిల్లా అధికారుల సంక్షేమ సంఘం అభినందించింది ఈ సందర్భంగా జిల్లా అధికారులు కలిసి పుష్పగు చ్ఛాన్ని అందించి అభినందనలు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు శ్రీధర్, వీర బుచ్చయ్య , వెంకన్న, రవీందర్, మధుసూదన్, నరేం దర్, రాజవీరు, శ్రీనివాస్ రాజ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

*కరీంనగర్ / ఫిబ్రవరి 09 (మనం న్యూస్ )*

## పేకాట శిబిరంపై పోలీసులు దాడులు

ధర్మపురి,ఫిబ్రవరి 09 మనం న్యూస్ : ఖండలంలోని నాగారం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వారిని ఎస్సై ఏలూరి కిరన్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం రోజున జరిపిన దాడుల్లో ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసి 18860 రూపాయలు వారి వద్ద స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## గాయత్రి విద్యానికేతన్ విద్యార్థుల ఫీల్డ్ ట్రిప్

పెద్దపల్లి, ఫిబ్రవరి 09 (మనం ప్రతినిధి): క్షేత్ర ప్రదర్శనలో భాగంగా గురువారం పెద్దపల్లి పట్ట ణంలోని గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులు ఎస్బీఐ మేయిన్ బ్రాం చ్ బ్యాంక్‌ని సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు బ్యాంక్‌లోని వివిధ కౌంటర్లు, అక్కడ లభించే సేవలను అసక్తిగా తిలకించారు. బ్యా ంక్ ఖాతాలో డబ్బులు ఎలా జమ చేయాలి, ఎలా డబ్బులు తీసు కోవాలి, దాని కోసం ఏ ఫారం నింపాలి అనే విషయాలను బ్యా ంక్ వారు అందించే వడ్డీరేట్లు, ఏవైసీ అంటే ఏమిటి, ఏటీఎం కార్డు ఎలా పొందాలి, ఏమైనా మార్పులు,చేర్పులు ఉంటే ఎలా చేసుకోవాలి, బ్యాంక్‌లో అందుబాటులో ఉంటే వివిధ రకాల సేవల గురించి బ్యాంక్ సిబ్బంది విద్యార్థులకు చక్కగా వివరించారు. ఈసందర్భంగా గాయత్రి విద్యాసంస్థల ఆధినేత అల్లెంకి శ్రీనివాస్ మాట్లాడుతూ నేటి కాలంలో అందరికి బ్యాంకింగ్ సేవలు, ఆన్‌లైన్‌లో లావాదేవీలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో పిల్లలచే బ్యాంక్ సందర్శన కార్యక్రం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులకు అన్ని సమస్యలను వివరించిన ఎస్బీఐ మేనేజర్ మస్తాన్‌వలీకి కృతజ్ఞతలు తెలిపారు.

మనం కావలెను
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక

'మనం' తెలుగు దినపత్రికకు ఈ దిగువ పేర్కొన్న సర్కిల్స్ పరిధిలో విలేకరులుగా పనిచేసేందుకు ఉత్సాహవంతులు కావలెను. చక్కటి రాత, తెలుగుభాషపై పట్టు ఉండి ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు కోరబడుతున్నవి.

కావలసిన ప్రాంతాలు :

కరీంనగర్ జిల్లా : కరీంనగర్ క్రైమ్, గంగాధర, గన్నేరువరం, మానకొండూర్ రూరల్.
జగిత్యాల జిల్లా : జగిత్యాల టౌన్, జగిత్యాల రూరల్, ఎడ్యూకేషన్, ధరూర్ క్యాంపు, మేడిపల్లి, ఇబ్రహీంపట్నం, కథలాపూర్, సారంగాపూర్, గొల్లపల్లి, మల్యాల, ఎండపల్లి,
రాజన్న సిరిసిల్ల జిల్లా : సిరిసిల్ల క్రైమ్, సిరిసిల్ల ఆర్.సి., రుద్రంగి, చందుర్తి, వేములవాడ టౌన్, వేములవాడ రూరల్, వేములవాడ ఆర్.సి., ముస్తాబాద్.
పెద్దపల్లి జిల్లా : పెద్దపల్లి / ఆర్.సి., టౌన్, రూరల్, రామగుండం, కోల్‌సిటీ, జూలపల్లి, ఓదెల, పాలకుర్తి, అంతర్గాం, 8ఇన్ క్లైయిన్ కాలని, బసంత్‌నగర్.

మనం
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక
ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యాలయం
ఇ.నెం. 1-6-169, మమత థియేటర్ ప్రక్కన, కలెక్టరేట్ రోడ్, భగత్‌నగర్, కరీంనగర్.
కె. తిరుపతి రెడ్డి
బ్యూరో ఇంచార్జ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా
సెల్ : 83339 98076